నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

మనిషి మారడనుచు మగనిగూర్చి సతియు
సతిని గెలువలేక పతియుగూడ
అరమరికలు లేక యనుబంధముతోడ
మెలుగునట్టి జంట వెలుగునిలన

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 4 | సంపుటి : 4 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 06-05 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## భారతీయుల రక్తం
# చిందితే సహించం

### ఇరాన్‌కు ఇండియా స్ట్రాంగ్ వార్నింగ్

- యూఏఈపై ఇరాన్ డ్రోన్ దాడి
- ముగ్గురు ఇండియన్స్‌కు గాయాలు
- తీవ్రంగా పరిగణించిన భారత్

2 లో




# మా నౌకలపై దాడి చేస్తే తుడిచిపెడతాం

- కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి
- హర్మూజ్ లో మళ్లీ కాల్పుల మోత
- దూకుడుగా వ్యవహరిస్తే ఊబిలో పడతారు : ఇరాన్
- యుఎఇ ఓడరేవుపై ఇరాన్ డ్రోన్ దాడి
- ముగ్గురు భారతీయులకు గాయాలు



టెహ్రాన్ మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
పశ్చిమాసియాలో మరోసారి ఘర్షణలు మొదలయ్యాయి. ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నదీ లేనిదీ తెలియని పరిస్థితి నెలకొంది. హర్మూజ్ జలసంధిలో ఇరు పక్షాలు కాల్పులకు దిగాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నదా అని అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు -మిగతా 2 లో



## శాసనసభా పక్ష నేతగా
# విజయ్ ఎన్నిక

- ప్రభుత్వం ఏర్పాటుపై సమావేశంలో చర్చ
- మెజార్టీ కోసం గవర్నర్‌ను 15 రోజులు గడువు కోరిన టివికె
- పొత్తు కోసం ఎవరినీ అడుక్కోబోమని స్పష్టీకరణ

చెన్నై,
తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటుకు కొన్ని సీట్లు తక్కువగా ఉన్న అంశాన్ని నేతలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ.. రాజకీయపరంగా ఆత్మగౌరవం విషయంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. పొత్తు విషయంలోనూ తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు. -మిగతా 2 లో

## సీఎం పదవికి
## స్టాలిన్ రాజీనామా..

2 లో



## ఎన్నికల ఫలితాలు..
# తారుమారు!

### బెంగాల్, అసోంలో బీజేపీ గెలవలేదు

- ఈసీ సహకారంతో ఎన్నికలను దొంగిలించింది
- కమలం పార్టీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆందోళన
- బెంగాల్‌లో 100 సీట్లు దొంగిలించారన్న మమత వాదనకు మద్దతు
- మధ్యప్రదేశ్, హరియాణా తరహాలోనే ఇక్కడా జరిగిందన్న కాంగ్రెస్ అగ్రనేత



న్యూఢిల్లీ, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పై కాంగ్రెస్ నేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో బీజేపీ ఎన్నికల్లో గెలవలేదని, ఎన్నికల సంఘం (ఈసీ) సహకారంతో ఫలితాలను తారుమారు చేసిందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ మేరకు తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 100కు పైగా సీట్లను బీజేపీ తారుమారు చేసిందంటూ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ చేసిన ఆరోపణలతో తాము ఏకీభవిస్తున్నామని రాహుల్ స్పష్టం చేశారు. బెంగాల్, అసోంలో ఎన్నికల ఫలితాలను స్పష్టంగా తారుమారు చేశారని ఆయన పేర్కొన్నారు. -మిగతా 2 లో



## మక్కల కొనుగోళ్లలో
## కావాలనే జాప్యం

- రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం
- నేటిలోగా సమాధానం రాకపోతే ఆందోళన తీవ్రం
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన కెటిఆర్


జనగామ,
రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. -మిగతా 2 లో



## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ
# హోదా కల్పించాలి

- పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా
- ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం వివక్షే
- ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు
- నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమే
- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా
- ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి

రాజన్నసిరిసిల్ల, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామాంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని -మిగతా 2 లో



## బెంగాల్లో నేను ఓడిపోలేదు...
# రాజీనామా చేయను

- బిజెపి కుట్రలతో గెలిచింది..
- తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్
- 100పైగా సీట్లు లూటీ చేశా
- మమతా బెనర్జీ వ్యాఖ్యలు

కోల్‌కతా, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. -మిగతా 2 లో



## పుదుచ్చేరి సీఎంగా
## మళ్లీ రంగస్వామి!..

- ఐదవసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధం

చెన్నై,
శాంత స్వభావం, మృదుభాషిగా పేరొందిన ఎన్ రంగస్వామి.. పుదుచ్చేరి సీఎంగా ఐదవసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఏప్రిల్ 9న జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ ఏఐఎన్ఆర్సీ నేతృత్వంలోని ఎన్డీయే ఘన విజయాన్ని అందుకుంది. పోటీ చేసిన 16 స్థానాల్లో ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలను గెలుచుకుంది. 10 స్థానాల్లో పోటీచేసిన బీజేపీ నాలుగింటిని కైవసం చేసుకుంది. కేవలం 30 మంది సభ్యులున్న పుదుచ్చేరి అసెంబ్లీలో మెజారిటీ మార్క్-16 కాగా, ఎన్డీయే కూటమి 18 చోట్ల విజయం సాధించింది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండియా కూటమి ఆరు స్థానాలకు పరిమితమైంది. డీఎంకే ఐదు స్థానాలు, -మిగతా 2 లో

## నేడు ఢిల్లీకి సీఎం
# రేవంత్ రెడ్డి

### కాంగ్రెస్ పెద్దలను కలవనున్న రేవంత్

- మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు అనుమతులపై దృష్టి సారించనున్న సీఎం
- కేరళలో యూడీఎఫ్ విజయం నేపథ్యంలో రేవంత్ పర్యటనకు మరింత ప్రాధాన్యత



హైదరాబాద్ మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, -మిగతా 2 లో

# భారతీయుల రక్తం చిందితే.. సహించం

-ఇరాన్‌కు ఇండియా స్ట్రాంగ్ వార్నింగ్
-యూఏఈపై ఇరాన్ డ్రోన్ దాడి
-ముగ్గురు ఇండియన్స్‌కు గాయాలు
-తీవ్రంగా పరిగణించిన భారత్



**న్యూఢిల్లీ,**
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లోని ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్ పై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిని భారత్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనలో ముగ్గురు భారత పౌరులు గాయపడటం పట్ల కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, హింసను తక్షణమే ఆపాలని అంతర్జాతీయ సమాజానికి భారత్ విజ్ఞప్తి చేసింది. ఫుజైరా చమురు పరిశ్రమ ప్రాంతంపై జరిగిన డ్రోన్ దాడిలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు భారతీయ కార్మికులకు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానిక అధికారులు వారిని ఆసుపత్రికి తరలించారు. యూఏఈ లోని భారత రాయబార కార్యాలయం నిరంతరం స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, బాధితులకు అందుతున్న చికిత్సను పర్యవేక్షిస్తోంది. యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఇరాన్ మొత్తం నాలుగు క్షిపణులను ప్రయోగించింది. వీటిలో మూడింటిని యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకోగా, ఒకటి సముద్రంలో పడిపోయింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలు వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్నే పాటించాలని అధికారులు సూచించారు.

## శాసనసభా పక్ష నేతగా
# విజయ్ ఎన్నిక

మొదటి తరువాయి



అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతు కోసం తమ పార్టీ ఎవరినీ అడుక్కోబోదని తెలిపారు. ఇక, మెజారిటీ నిరూపించుకునేందుకు టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి 15 రోజుల సమయం కోరారు. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 108 సీట్లు సాధించి, అతిపెద్ద పార్టీగా మారింది. అధికారం చేపట్టాలంటే మరో 10 సీట్లు అవసరం. టీవీకేకు 35 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు కోసం టీవీకే ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కాంగ్రెస్‌తో రాయబారం నడుస్తోందని తెలుస్తోంది. విజయ్ తండ్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు. విజయ్ పార్టీ టీవీకే అధికారం చేపట్టాలంటే పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితి. విజయ్ ఎవరితో పొత్తువైపు మొగ్గు చూపుతారో తెలియాలి.


## ఎన్నికల ఫలితాలు.. తారుమారు!

మొదటి తరువాయి



ఇది బీజేపీకి తెలిసిన పాత వ్యూహమేనని, గతంలో మధ్యప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర రాష్ట్రాలతో పాటు 2024 లోక్ సభ ఎన్నికల్లో కూడా ఇదే తరహా పద్ధతిని చూశామని పేర్కొన్నారు. "ఎన్నికలను దొంగిలించడం, ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేయడం.. ఇక వాళ్లకు మిగిలిన దారి ఏముంది!" అని రాహుల్ తన పోస్టులో ప్రశ్నించారు. బీజేపీ కేవలం ఎన్నికలనే కాకుండా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వ్యవస్థల విశ్వసనీయతను కూడా దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా..
-గవర్నర్ ఆమోదం



చెన్నై:
అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తమిళనాడు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ ఆఫీసుకి పంపినట్టు డీఎంకే పార్టీ వర్గాలు మంగళవారం మీడియాకు తెలిపాయి. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే ఓటమిపాలైంది. దీంతో ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పనిచేస్తామని స్టాలిన్ ప్రకటించారు.ఇదిలా ఉండగా, ఆయన పంపిన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ ఆమోదించారు. ఈ మేరకు లోక్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. తదుపరి ప్రభుత్వం ఏర్పడే వరకు ముఖ్యమంత్రి బాధ్యతల్లో కొనసాగాలని స్టాలిన్‌ను గవర్నర్ కోరారు.

# మా నౌకలపై దాడి చేస్తే తుడిచిపెడతాం

మొదటి తరువాయి

డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. ఇరాన్ వైపు నుంచి దూసుకొచ్చిన 19 క్షిపణులు, డ్రోన్లను తన గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని, డ్రోన్ దాడిలో ఫుజైరా ప్రాంతంలోని చమురు ఓడరేవు వద్ద మంటలు వ్యాపించాయని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) తెలిపింది. పర్షియన్ గల్ఫ్‌లో తమ నౌకలపై దాడి చేస్తే ఈ భూమి పైనే లేకుండా తుడిచిపెడతానని ఇరాన్ దళాలను ట్రంప్ హెచ్చరించారు.

**రాజకీయ సంక్షోభానికి సైనిక పరిష్కారం ఉండదు : ఇరాన్**
రాజకీయ సంక్షోభానికి సైనిక పరిష్కారం ఉండదని హర్మూజ్ లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు నిరూపిస్తున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ చెప్పారు. దుందుడుకు చర్యలకు పాల్పడితే ఊబిలో కూరుకుపోతారని ఆయన అమెరికా, యుఎఇలను హెచ్చరించారు. పాకిస్తాన్‌తో జరుపుతున్న చర్చలు పురోగతిలో



ఉండగానే అమెరికా ఊబిలోకి దిగుతోందని, దాని మిత్రదేశం యుఎఇ కూడా అదే పని చేస్తోందని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి నౌకలను బయటికి పంపే విషయంలో సాయపడడానికి అమెరికా ముందుకు తెచ్చిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' ప్రణాళికను ఆయన ఎద్దేవా చేశారు.

**ఆమోదయోగ్యం కాదు : కేంద్రం**
యుఎఇలోని ప్రధాన చమురు ఓడరేవుపై జరిగిన దాడిలో ముగ్గురు భారత జాతీయులు గాయపడడంపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఈ చర్య ఆమోదయోగ్యం కాదని తెలిపింది. 'శత్రుత్వానికి వెంటనే స్వస్తి చెప్పాలని, పౌర మౌలిక సదుపాయాలను, ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం ఆపేయాలని కోరుతున్నాం' అని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్యను పరిష్కరించుకోవాలన్న తన వైఖరిని పునరుద్ఘాటించింది.

**మంటల్లో చిక్కుకున్న దక్షిణ కొరియా నౌక**
దక్షిణ కొరియాకు చెందిన ఓ నౌక సోమవారం హర్మూజ్‌లో మంటలలో చిక్కుకుంది. అంతకుముందు నౌకలో పేలుడు సంభవించింది. నౌకను తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు సమీపంలోని ఓడరేవుకు తరలిస్తున్నారు. అగ్నిప్రమాదానికి కారణమేమిటో తెలుసుకునేందుకు విచారణ జరుపుతున్నామని సియోల్ విదేశాంగ శాఖ తెలిపింది

# మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

మొదటి తరువాయి

అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.
ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్



ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. లేకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

మొదటి తరువాయి

నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి



తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ఎ÷-లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించిన ప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర (ఓ÷ూఖ) కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## నేడు ఢిల్లీకి సీఎం
# రేవంత్ రెడ్డి

మొదటి తరువాయి

సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై విజ్ఞప్తులు చేయనున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు, ఏఐసీసీ అగ్రనేతలతో కూడా ముఖ్యమంత్రి సమావేశం కాబోతున్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సాధించిన అఖండ విజయం ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించి, కూటమి విజయానికి తనవంతు కృషి చేశారు. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు రేసులో బలంగా వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి, వేణుగోపాల్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో, ఈ ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ సమీకరణాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

## పుదుచ్చేరి సీఎంగా
# మళ్లీ రంగస్వామి!..


మొదటి తరువాయి



కాంగ్రెస్ ఒక స్థానంలో గెలుపొందాయి. సిట్టింగ్ ఎంపీ, మాజీ సీఎం వీ వైతిలింగంతో సహా కాంగ్రెస్ అభ్యర్థుల్లో చాలామంది ఓటమిపాలయ్యారు. కొత్తగా ఆవిర్భవించిన టీవీకే రెండు సీట్లు గెలుచుక

## బెంగాల్లో నేను ఓడిపోలేదు...
# రాజీనామా చేయను

మొదటి తరువాయి



లోక్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారంనాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..ఇసి, బిజెపిలపై ఘాటు విమర్శలు చేశారు. బిజెపి కనుసన్నల్లో ఇసి పనిచేసిందన్నారు. అమిత్ షా, ప్రధాని మోడీలు కలసి కటు÷-రలు చేశారని మండిపట్టారు. 'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు. భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.

# మే 24 న ఎల్బీనగర్ లో బీసీ ప్రభంజనం ...

**-హాజరు కానున్న బీసీ అగ్ర నేతలు...**
**-రాజ్యాధికారమే ఏకైక లక్ష్యం...**
**-కార్పొరేషన్ ఎన్నికల్లో 50 శాతం వాటా ఇవ్వాల్సిందే...**



**ఎల్బీనగర్, మే 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జనాభా దామాషా ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు యాభై శాతానికి పైగా రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మన్సురాబాద్ డివిజన్ లో జరిగిన సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. చట్టసభల్లో అవకాశం లేకపోవడంతో అవకాశం అర్హతలు ఉండి కూడా చాలా మంది బీసీ నేతలు అగ్రవర్ణాల వారితో పోటీ పడలేక పోతున్నారు అని ఆయన అన్నారు. జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేయడానికి సాహసం చేయకపోవడంతో మెజారిటీ స్థానాల్లో అన్ని ప్రధాన పార్టీలు అగ్రవర్ణాల వారికే టిక్కెట్లు కేటాయిస్తున్నారు అని ఆయన వివరించారు. జనాభాలో 65 నుంచి 70 శాతం ఉన్న బీసీలకు అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి కనీసం చట్టసభల్లో పోటీ చేయడానికి రిజర్వుడు స్థానాలు ఉన్నాయి అని సత్యనారాయణ తెలిపారు. కొంతమేరకు అయిన ఎస్సీ ఎస్టీ వర్గాల వారు చట్టసభల్లో వెళ్లడానికి రిజర్వుడు స్థానాలు అవకాశం కల్పిస్తున్నాయి అని ఆయన అన్నారు. పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన ఇప్పుడున్న ఎస్సీ ఎస్టీ రిజర్వుడు స్థానాలు కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వుడు స్థానాలు లేవు కనీసం కార్పొరేషన్ ఎన్నికల్లో అయిన బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

**బీసీ ప్రభంజనం సృష్టిస్తోంది -తెలంగాణ బీసీ ప్రభంజనం సమన్వయకర్త జాల కిషన్**

తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ వంటి రాజధాని మహా హైదరాబాద్ కార్పొరేషన్ మూడు కార్పొరేషన్ లు అయ్యాయని బీసీ ప్రభంజనం సమన్వయకర్త టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు జాల కిషన్ తెలిపారు. ఈ మూడు కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు యాభై శాతానికి పైగా రిజర్వేషన్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన జనాభా లెక్కల ప్రకారమే మూడు వందల డివిజన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధత పై అన్ని పార్టీలు సహకరించాలని కిషన్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు యాభై శాతానికి పైగా రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీసీ ప్రభంజనం నిర్వహిస్తున్నట్లు కిషన్ తెలిపారు. మే 24 న ఆదివారం ఉదయం పది గంటలకు ఎల్బీనగర్ ఎస్ కె గార్డెన్ లో బీసీ ప్రభంజనం జరుగుతుంది అని ఆయన వివరించారు. ఈ ప్రభంజనం సభకు అన్ని రాజకీయ పార్టీల నుంచి అఖిల పక్షం బీసీ నాయకులు, బీసీ విద్యావంతులు, మేధావులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారు అని ఆయన వివరించారు. బీసీ ప్రభంజనం సభకు మద్దతుగా ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన నాయకులు దళిత సంఘాలు కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు. రాజకీయ చైతన్యం అధికంగా ఉండే ఎల్బీనగర్ ప్రాంతంలో బీసీ ప్రభంజనం తీవ్ర ప్రభావం చూపుతోంది అని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు బొంగు వెంకటేష్ గౌడ్, శ్యామ్ యాదవ్, ఉపేంద్ర యాదవ్, తానాజీ, సురేష్, తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ జెఎసి ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రభంజనం సభకు దళిత గిరిజన బీసీ సంఘాలు రాజకీయాలకు అతీతంగా తరలి రావాలని బీసీ ప్రభంజనం నాయకులు విజ్ఞప్తి చేశారు.

# వేసవికాలంలో దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**మర్రిగూడ, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేసవికాలంలో ప్రజలు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని నాంపల్లి సీఐ డి. రాజు సూచించారు. శుభకార్యాల కోసం ఊర్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, రాత్రివేళల్లో ఆరుబయట నిద్రించే సమయంలో బంగారు ఆభరణాలు ధరించవద్దని ఆయన హెచ్చరించారు. ఇండ్ల వద్ద భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# తల్లి పై దాడి చేసిన కొడుకు



**మర్రిగూడ, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుదబక్ష్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కుమారుడు యాదయ్య తన తల్లి కడారి అబ్బమ్మపై కత్తితో దాడి చేశాడు. భార్య కొంతకాలంగా తన వద్దకు రాకపోవడంతో యాదయ్యలో అనుమానాలు పెరిగి, తరచూ తల్లితో వాగ్వివాదాలు జరిగేవని గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో మానసిక స్థితి కోల్పోయిన యాదయ్య తల్లిపై దాడి చేశాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, 108 అంబులెన్స్ సిబ్బంది అబ్బమ్మను రక్తపు మడుగులో నుంచి మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. యాదయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గట్టు ఇప్పలపల్లి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు సన్మానం



**తలకొండపల్లి, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన జెడ్‌పి హెచ్‌ఎస్ గట్టు ఇప్పలపల్లి విద్యార్థులు, ఉపాధ్యాయులను గ్రామ సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ దేరంగుల అనిత ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయులు రాములయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, క్రాంతి కుమార్, ప్రేమయ్య కృషి వల్ల విద్యార్థులు మంచి మార్కులు సాధించారని సర్పంచ్ అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు పల్లపు గీతాంజలి (564), బాణావత్ అరుణ్ (541), బోయిన్పల్లి అక్షర శ్రీ (516), కళ్యాణ్ కార్ నందిని (507), కళ్యాణ్ కార్ అశ్విని (506), రిత్విక రెడ్డి (496)తో పాటు పాసైన అందరినీ సన్మానించారు. పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయుల కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని సర్పంచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హాజిపల్లి క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రధానం



**ఫరూఖ్‌నగర్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: హాజిపల్లి గ్రామంలో ఉపసర్పంచ్ ఇస్నాతి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాజిపల్లి ప్రీమియం లీగ్--2 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఇస్నాతి శ్రీనివాస్ హాజరై విజేతలకు బహుమతులు, నగదు బహుమతులు అందజేశారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "యువతకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరం. క్రీడలు ఆనందం, ఆరోగ్యం, శారీరక దృఢత్వం, మానసిక బలం ఇస్తాయి" అని అన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న ఉపసర్పంచ్ గంగాధర్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చించొటి కుమార్, శశిధర్, ఎంకే నవీన్, రాజు, హరినాథ్, విష్ణు, నరేందర్, రాఘవేందర్, అంజి, మహేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంట మార్పిడి, లాభదాయక పంటలపై దృష్టి సారించాలి

**- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు

**ఎలిగేడు, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎలిగేడు మండల కేంద్రంలో జరిగిన రైతు వారోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. ఆయిల్ పామ్ రైతులకు చెక్కులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ, "వరి సాగు మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి. ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలను విస్తరించాలి. యూరియా వినియోగాన్ని తగ్గించి, పంట అవశేషాలను కాల్చకుండా నేల సారాన్ని కాపాడాలి" అని సూచించారు. తన చిన్ననాటి రోజుల్లో ఎలిగేడు మండలంలో నీటి కొరతను గుర్తుచేసి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లిలో 1.4 లక్షల ఎకరాలకు నీరు అందించబడిందని తెలిపారు. 2014 తర్వాత కాలువలను నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు నష్టపోయారని విమర్శించారు. "పెసర్లు, జొన్నలు, కందులు వంటి పంటలు సాగు చేసిన రైతులు ఇప్పుడు వరిపైనే ఆధారపడుతున్నారు. ఇది లాభదాయకం కాదు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి. వచ్చే ఏడాది ఎలిగేడు మండలంలో వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ యాకన్న, పలు గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


పాల్గొన్న రైతులు,ప్రజలు

## ఘనంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జన్మదిన వేడుకలు..

**-- కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**

**శంషాబాద్**
**మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మైలార్దేవ్పల్లిలోని ఆయన నివాసానికి శంషాబాద్, గండిపేట్, నార్సింగ్, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేదల పెన్నిధి ప్రకాష్ గౌడ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గణేష్ గుప్తా,దూడల వెంకటేష్ గౌడ్, చంద్రారెడ్డి, మల్లారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రసాద్ ,ప్రభాకర్, విటల్ రాములు శ్రీనివాస్ కరుణాకర్, నాగేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు నుంచే తెలంగాణ రక్షణ సేన తొలి అడుగు

**- కప్పాటి పాండురంగా రెడ్డి**



**కందుకూరు, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రక్షణ సేన పార్టీ స్థాపించిన తర్వాత అధినేత్రి కల్వకుంట్ల కవిత రాజకీయంగా తొలి అడుగు పాలమూరు నేలమీద నుంచే వేయనున్నారని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తెలిపారు. ఈనెల 8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, సాయంత్రం పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద జరిగే సాధన సభలో కవిత ప్రసంగించనున్నారు. కృష్ణా జలాల సాధనను పార్టీ తొలి ప్రాధాన్యతగా తీసుకున్న కవిత, తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నీటి వినియోగంలో రాష్ట్రం వెనుకబడటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే కారణమని పలు వేదికలపై స్పష్టం చేసినట్లు పాండురంగారెడ్డి అన్నారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు 11 ఏళ్లు గడిచినా పనులు పూర్తి కాకపోవడంపై ప్రజల్లో ఆగ్రహం ఉందని, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయించేందుకు కవిత ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నారని తెలిపారు.


ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంని మర్యాదపూర్వకంగా కలిసిన తలకొండపల్లి యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్.

# ప్రధాని పర్యటన ఏర్పాట్లలో అప్రమత్తత అవసరం

- జిల్లా ఇంచార్జి కలెక్టర్ మను చౌదరి



**రంగారెడ్డి, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈ నెల 10న భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి హైద్రాబాద్ పర్యటన సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరంలో ఇంఛార్జి కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయితో కలిసి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ, “ప్రధాని పర్యటనలో ఎక్కడా చిన్న తప్పిదం జరగకుండా అధికారులు తమకు కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలి” అని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, పోలీస్, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్, ఫుడ్ సేఫ్టీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు సేవ చేసే భాగ్యం లభించింది



**ఎలిగేడు, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలిగేడు పిఎసిఎస్ ఇన్‌చార్జి ఛైర్పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, “రైతులకు సేవ చేసే భాగ్యం లభించింది” అని అన్నారు.తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సహకారంతో ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుల్తానాపూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, డైరెక్టర్ తాటిపల్లి రమేష్ బాబు, సీఈఓ కేశెట్టి విక్రమ్ పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి




**తలకొండపల్లి, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. శరత్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.ఓ నిర్మాణానికి అనుమతుల కోసం రూ.20 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి



**తిప్పర్తి, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని మ్యాచర్‌తో సంబంధం లేకుండా వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నన్నూరి వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం తిప్పర్తి సబ్ మార్కెట్ యార్డులో రైతు సంఘం ఆధ్వర్యంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, “తాలు పేరుతో రైతులను మోసం చేయకుండా, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి. లారీలను సకాలంలో ఏర్పాటు చేసి కొనుగోలు వేగవంతం చేయాలి” అని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మన్యం బిక్షం, సిఐటియు మండల కన్వీనర్ భీమా దానికి గణేష్, డివైఎఫ్ఐ కార్యదర్శి పోకల శశిధర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు దొంగరి వెంకన్న, నాయకులు మైల సైదులు, సాహిద్, రఫీ, తేజావత్ నర్సింహా, కన్నెబోయిన సైదులు, శరత్ బాబు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో ‘మన చద్దన్నం’ ద్వితీయ వార్షికోత్సవం



**నల్లగొండ, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తూ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న మన చద్దన్నం న్యాచురల్ ఫుడ్ స్టాల్ విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది.నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ ముందు ఉన్న మెయిన్ స్టాల్‌లో మంగళవారం జరిగిన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు అదనపు ఎస్పీ జి. రమేష్ హాజరై కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ, “చద్దన్నం మిల్లెట్స్ ద్వారా ఆహారం తీసుకోవడం వల్ల బీపీ, షుగర్లు తగ్గుతాయి. కల్తీ లేని ఆహారం అందిస్తూ, యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యాదగిరి సేవలు ప్రశంసనీయం” అని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు కె.వై. గిరి, కార్పొరేటర్ మల్లికార్జున్, జాతీయ ఉత్తమ ఫోటోగ్రఫీ అవార్డు గ్రహీత జర్నలిస్ట్ కంది భజరంగ్, పుల్లెంల శంకర్, మన చద్దన్నం టీం సభ్యులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదుకు ఆహ్వానం



**నల్లగొండ ,మే 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీలో కొత్త సభ్యత్వాల నమోదు, వివరాల నవీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తి ఉన్నవారు రెండు ఫోటోలు, ఆధార్ కార్డు, రూ.1,160 రుసుముతో ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని పాలకమండలి కోరింది. పాత సభ్యులు తమ ఫోన్ నంబర్, చిరునామా వివరాలను కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య అప్డేట్ చేసుకోవచ్చు. సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

## ఎండ తీవ్రతకు ఇండోర్ గేమ్స్ పై ఆసక్తి

**ఎలిగేడు, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేసవి తీవ్రత కారణంగా పిల్లలు బయట ఆటలకంటే ఇండోర్ గేమ్స్‌కి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. సెలవుల్లో స్నేహితులతో కలిసి గ్రౌండ్‌లో ఆటలాడాలని అనుకున్నా, భానుడి వేడి భయంతో పిల్లలు బయటకు వెళ్లడం తగ్గించారు.తల్లిదండ్రులు కూడా పిల్లలు ఎండలో డీహైడ్రేషన్‌కు గురవుతారనే ఆందోళనతో, ఇంట్లోనే ఆటలాడేలా ప్రోత్సహిస్తున్నారు. ఇండోర్ గేమ్స్ పరికరాలను కొనుగోలు చేసి అందించడం వల్ల పిల్లలు వేసవి సెలవులను సరదాగా గడుపుతున్నారు.చదరంగం, క్యారమ్ బోర్డు, భూకైలాస్ వంటి ఆటలు ఆడుతూ పిల్లలు ఆనందంగా సమయాన్ని గడుపుతున్నారు.



చదరంగం ఆడుతున్న చిన్నారులు

## ఉపాధి హామీ పనుల పరిశీలన



**వెల్దండ, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మండల పరిధిలోని అల్లంతోటబావి తాండా, బండోనిపల్లి గ్రామాలను మండల ఎంపీడీవో కృష్ణయ్య సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కూలీలు ఉదయం 6.30 గంటల వరకు పనికి వచ్చి, ఫీల్డ్ అసిస్టెంట్స్ సూచనల మేరకు పనిచేసి త్వరగా ఇంటికి వెళ్లాలి. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి” అని గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.అల్లంతోటబావి తాండాలో ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించి, లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, ఎంపీఓ ఈశ్వర్, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి నందకిషోర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మాతృదేవోభవ


-తల్లీ కొడుకులు
పడవలో విహరిస్తూ...
ప్రకృతిని ఆస్వాదిస్తూ...
పరవశించే అపురూప దృశ్యం
-అంతలోనే...
ప్రమోదంగా సాగుతున్న
ప్రయాణంలో
ప్రమాదం సంభవించింది
ప్రకృతి వికృతిగా మారి
ప్రళయాన్ని సృష్టించింది
దారుణ మారణకాండతో
వికటాట్టహాసం చేసింది
-పరిస్థితిని పసిగట్టిన ఆ తల్లి
పట్టుబట్టి
ప్రాణాలను ఫణంగా పెట్టి
బాబును గుండెలకు చుట్టి
ధైర్యాన్ని కూడగట్టి
సుతుని రక్షించాలనుకున్నా
పాపపు విధి
వారిని నట్టేట ముంచి
మట్టు పెట్టింది
-అమ్మా.. నువ్వు ఓడినా
బాబును గుండెలకు హత్తుకున్న దృశ్యం
ఎందరినో
గుండెలవిసేలా రోధింపజేసింది
నీ పరాజయాన్ని చూసి
విధి పరాభవం చెందింది
విపత్తి కలిగించిన ప్రకృతి
తన అకృత్యానికి
అవమాన పడింది
-నర్మదా నది సైతం ఏడిస్తే
కన్నీటి దారాలు
ఆ నీటిలోనే కలిసిపోయాయి
నీ మహోన్నత త్యాగానికి
ఉన్నత శిఖరాలు సైతం
శిరస్సు వంచి నమస్కరిస్తున్నాయి
నికృష్టమైన ప్రమాదం
ఉత్కృష్టమైన
నీ త్యాగం ముందు
దోషిగా నిలబడింది
చావు అనే చేదు నిజం
నీ కడుపు తీపి ముందు
రుచిని కోల్పోయింది
-అలలు రేగిన
కలలు చెదిరిన
కన్న కొడుకును కాపాడాలనే
విశ్వప్రయత్నంలో
నీవు విఫలమైన
విశ్వమంతా
నిన్ను విజేతగా గుర్తించింది

(జబల్పూర్ లో జరిగిన పడవ ప్రమాదంలో కొడుకు కోసం అమ్మ చేసిన త్యాగం గురించి )

Ch. శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
ZPHS కనుకుల
స్వగ్రామం :ఎలిగేడు



## నవోదయకు ఎంపికైన ఆర్యన్



**యాచారం, మే5 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జవహర్ లాల్ నవోదయ విద్యాలయానికి యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన మడ్డి ఆర్యన్ అనే విద్యార్థి ఎన్నికయ్యారు. నవోదయ విద్యాలయ సమితి రెండో విడత ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. రెండో విడత ఎంపికలో భాగంగా ఆర్యన్ నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నవోదయ పాఠశాలకు ఆరవ తరగతి ప్రవేశానికి ఎంపికైన ఆర్యన్ పలువురు అభినందించారు.

### మృతుడి కుటుంబానికి

# అండగా మాజీ సర్పంచ్

**- కుటుంబానికి 5,000/- ఆర్థిక సహాయం అందించిన ఎల్ఎన్ రెడ్డి**



**ఆమనగల్లు, మే 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కడ్తాల మండల కేంద్రానికి చెందిన సిరిగిరి మహేష్ చారి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మృతదేహానికి పూలమాలలతో నివాలర్పించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి 5,000/- ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకు తావివ్వకుండా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ఉంటామని, సమాజ శ్రేయస్సే తమ ధ్యేయమని, మండల పరిధిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నామని బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. మాజీ సర్పంచ్ తోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

### కడ్తాల్ నూతన సీఐ

# సైదిరెడ్డికి సన్మానం



**ఆమనగల్లు, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కడ్తాల్‌లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ సైదిరెడ్డిను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సైదిరెడ్డి మాట్లాడుతూ, "గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలి. శాంతిభద్రతలకు సహకరించాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. ఆన్‌లైన్ సైబర్ మోసగాళ్ల వలలో పడకూడదు. అనుమాస్పద వ్యక్తులు ఊర్లలోకి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్కా శివానంద యాదవ్ పాల్గొన్నారు.

# లాలపల్లెలో వైభవంగా బోనాలు


పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు


ఇంటికో బోనంతో మహిళలు

**ఎలిగేడు, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ, మహాలక్ష్మీ, భూలక్ష్మీ, బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి బోనాలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసుకువచ్చి, బైండ్ల పూజారుల డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య పోచమ్మ ఆలయానికి తరలించారు. గ్రామ ప్రజలు పాడి పంటలు సమృద్ధిగా పండాలని, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కుల సంఘ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. అదే గ్రామంలో జరిగిన పోచమ్మ బోనాల ఉత్సవాలకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. "గ్రామం అంతా ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, సర్పంచ్ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శాలిగౌరారం మండల టాపర్ దివ్యశ్రీ కి నల్గొండ కలెక్టర్ సన్మానం



**శాలిగౌరారం, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవలే వెలువడిన పదవతరగతి 2026 ఫలితాలలో జెడ్పిహెచ్ఎస్ మాధవరం కలాన్ కు చెందిన ముషం దివ్య శ్రీ 600 మార్కుల కు గాను 561మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మంగళవారం నల్గొండ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చంద్ర శేఖర్ దివ్య శ్రీ ని సన్మానించి, ప్రశంసా పత్రం తో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలానే రాబోయే రోజుల్లో కూడా బాగా చదివి అమ్మానాన్న లకు మంచి పేరు తేవాలని, భవిష్యత్తు లో మా సహకారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జడ్పిహెచ్ఎస్ మాదారం ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న భాస్కర్ రావు



**కల్వకుర్తి, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వెల్దండ సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన ఆలయ అభివృద్ధి కోసం రూ. 21,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కృష్ణ యాదవ్, కల్వకుర్తి మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, సాయికుమార్, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ మండల నాయకులు పాల్గొన్నారు.

# చింతలపల్లి.. అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఏర్పాటు





**ఆమనగల్లు, మే 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొప్పు వెంకటయ్య, మాజీ అధ్యక్షులు కొప్పు బాలయ్య, కొప్పు గిరి సమక్షంలో మంగళవారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సమావేశం ఏర్పాటు చేసుకొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పు శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా కొప్పు బాలయ్య, జంతుక వినోద్, కార్యదర్శిగా కొప్పు శెట్టయ్య, కోశాధికారి కొప్పు యాదయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, ప్రచార కార్యదర్శి కొప్పు రాజు మరియు ఆర్గనైజర్ లుగా కొప్పు జంగయ్య, కానుగుల మధు, కొప్పు సంతోష్ కుమార్, కొప్పు సాయి, గౌరవ అధ్యక్షులుగా కొప్పు అశోక్ మహారాజు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. చింతలపల్లి అంబేద్కర్ నూతన కమిటీ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొప్పు కుమార్, వార్డు మెంబర్లు జంగమ్మ, యాదయ్య, కొప్పు నర్సింహా, ముత్యాల సురేష్, కొప్పు బాలరాజ్, కొప్పు పార్వతయ్య, కొప్పు సుదర్శన్, గద్ద ప్రశాంత్, కొప్పు శ్రీకాంత్, విజేందర్, బాలరాజ్, భాను, భరత్, తరుణ్, మోక్తల పవన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధికి రూ.1 కోటి 35 లక్షలు

**ఎలిగేడు, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓదెలలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 1 కోటి 35 లక్షలు మంజూరైనట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. ఎలిగేడు మండలం శివపల్లిలోని ఆయన నివాసంలో ఆలయ పాలకమండలి చైర్మన్ చీకట్ల మొండయ్య ఆధ్వర్యంలో పాలకవర్గం, ఈవో సదయ్య, అర్చకులు, సిబ్బంది విజయరమణారావును సన్మానించారు. ఆలయ అర్చకులు ఆయన కుటుంబానికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ, "ఆలయ అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. రూ. 1 కోట్లతో ఆలయ ఆవరణలో సీసీ



రోడ్లు, రూ. 15 లక్షలతో టాయిలెట్లు, రూ. 20 లక్షలతో లైటింగ్ ఏర్పాటు త్వరలో చేపడతాం" అని తెలిపారు. ఓదెల మల్లన్న ఆలయం పెద్దపల్లి జిల్లాలో ప్రధాన ఆలయంగా ప్రసిద్ధి చెందిందని, గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారని, ఆలయానికి ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరైనట్లు ఆయన వివరించారు. భక్తుల సౌకర్యార్థం కొత్తగా 21 వసతి గదులు నిర్మించేందుకు దాతల సహకారంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ చీకట్ల మొండయ్య, ఈవో సదయ్య, డైరెక్టర్లు కట్కూరి సమ్మిరెడ్డి, ఉప్పుల శ్రావణ్ కుమార్, జీలుక రవీందర్, కొండ శ్రీనివాస్, తీర్థాల రాజారామ్, తాళ్లపల్లి శ్రీనివాస్, రవికుమార్, గంట రమేష్, కోదాటి మనోహర్ రావు, ప్రధాన అర్చకులు వీరభద్రయ్య, అర్చకులు అభిషేక్, సిబ్బంది కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం సభ్యత నమోదు విజయవంతం చేయాలి

**- అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేష్**



**ఆమనగల్లు, మే 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీలోని యువకులు, వివిధ గ్రామాల యువజన సంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు మంగళవారం నుండి చేపట్టే అంబేద్కర్ యువజన సంఘం సభ్యత నమోదును ప్రతి ఒక్కరు 100 రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేష్ కోరారు. సభ్యత నమోదుతో అంబేద్కర్ భావజాలం ప్రజల్లోకి తీసుకెళ్లడం ధ్యేయమని అన్నారు. నిరుపేద విద్యార్థులకు అందుకోవడమే తమ లక్ష్యమని తెలిపారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో నూతన కార్యవర్గం ఎన్నుకోబడుతుందని పేర్కొన్నారు. కొందరు ప్రవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న సంఘాలు చెల్లవని తెలిపారు. పట్టణ కేంద్రంలో అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ తర్వాత కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. సభ్యత నమోదుకు అందరు సహకరించాలని మహేష్ కోరారు.

# ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిన మెగా జాబ్ మేళా

**కరీంనగర్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రకటించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని, జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా జాబ్ మేళాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను కలెక్టర్ చిత్రా మిశ్రా స్వయంగా పర్యవేక్షించారు. యువతీ యువకులు ఎంతమంది హాజరయ్యారు, ఏ కంపెనీలు అవకాశాలు కల్పించాయి, వసతుల ఏర్పాట్లు ఎలా ఉన్నాయన్న అంశాలను ఆమె పరిశీలించారు. అధికారులు సమన్వయంతో మేళాను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసిస్తూ, రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తితో మరిన్ని జాబ్ మేళాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ మేళాకు అనూహ్య స్పందన లభించింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన దాదాపు 3,000 మంది నిరుద్యోగ యువతీ



యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చి అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలర్లు, తాగునీటి వసతి కల్పించగా, టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేసి అభ్యర్థులకు ఉపశమనం కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీలతో పాటు స్థానిక కంపెనీలు కూడా పాల్గొన్నాయి. ఐటీ, నాన్‌ఐటీ, హెల్త్‌కేర్, ఆర్గానిక్, డైరీ, అగ్రికల్చర్ రంగాలకు చెందిన సుమారు 90 కంపెనీలు నియామక ప్రక్రియను నిర్వహించాయి. 997 మంది ప్రాథమికంగా ఎంపిక కాగా, 478 మందిని తక్షణమే ఉద్యోగాలకు ఎంపిక చేసి త్వరలో నియామక పత్రాలు అందజేయనున్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం 95 స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు సందేహాలు నివృత్తి చేసేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే. మహేశ్వర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, పరిశ్రమల శాఖ జీఎం సాల్మన్ రాజు, పీడీ మెప్మా స్వరూపరాణి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు.

## జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్ డ్రైవ్




**పెద్దపల్లి, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మే 6న పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మావతి ఏసి కన్వెన్షన్ హాల్‌లో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రకటించారు. ఈ కార్యక్రమంలో 20 లోకల్ సంస్థలు, 48 నాన్ లోకల్ సంస్థలు కలిపి మొత్తం 68 కంపెనీలు పాల్గొంటున్నాయి. సుమారు 3439 ఉద్యోగ అవకాశాలు లభ్యమవుతాయని, జీతం రూ.18,000 నుండి రూ.80,000 వరకు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. టెలికాం, కమ్యూనికేషన్, కస్టమర్ సపోర్ట్, బిపిఓ, సేల్స్, మార్కెటింగ్, డిజిటల్ సర్వీసెస్, ఫీల్డ్ అసోసియేట్ వంటి విభాగాల్లో అవకాశాలు అందుబాటులో ఉంటాయి. ఎస్ఎస్సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, ఎంబిఏ అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. రెజ్యూమ్, ఆధార్‌తో పాటు డిఈఈటి పోర్టల్‌లో నమోదు చేసుకుని హాజరుకావాలని సూచించారు. యువత ఉపాధి పొందడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా జిల్లా అభివృద్ధికి కూడా దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## సామాజిక కార్యకర్తకు పోలీసుల ప్రత్యేక అభినందన




**హుస్నాబాద్ , మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కోహెడ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ చురుకుగా పనిచేస్తున్నందుకు పోలీసుల ప్రత్యేక అభినందన అందుకున్నారు. మంగళవారం నిర్వహించిన మన పోలీస్ -- మన ఊరు కార్యక్రమంలో సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేత, ఏసీపీ సదానందం, ఎస్ఐ పి. అభిలాష్‌లు రాజుకు టీ-షర్ట్ అందజేసి ప్రశంసించారు. అధికారులు మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, ధూమపానం, మద్యం, మాదకద్రవ్యాల వంటి సామాజిక సమస్యలపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించడం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. పిడిశెట్టి రాజు మాట్లాడుతూ స్మోకింగ్ వద్దు, డ్రింకింగ్ వద్దు, డ్రగ్స్‌కు దూరంగా ఉండండి, రోడ్డు భద్రత పాటించండి వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం తన సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సామాజిక చైతన్యం కల్పించడంలో పిడిశెట్టి రాజు కృషిని పోలీసులు ప్రత్యేకంగా గుర్తించి అభినందించారు.

## ధర్మపురి గోదావరిలో పీఎంజే ఘటనకు సంబంధించిన బండి, హెల్మెట్ లభ్యం



**కరీంనగర్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పీఎంజే జ్యువెలరీ షాపులో బంగారు ఆభరణాలను దోచుకుని పరారైన దొంగలు జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరి నది ఒడ్డున ఒక బైక్ మరియు హెల్మెట్‌ను వదిలి వెళ్లినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. దొంగల కదలికలపై క్లూస్ సేకరించేందుకు పోలీసులు గోదావరి ఒడ్డున పరిశీలనలు కొనసాగిస్తున్నారు. హెల్మెట్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు భాగంగా ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు సమాచారం. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.

# హిందూవులు ఐక్యతతో ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

**-సురేష్ ఆత్మరామ్**




**గంగాధర, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు సురేష్ ఆత్మరామ్ గురూజీ హిందూ సమాజం ఐక్యంగా నిలిచి ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హిందుత్వం మానవాళి శ్రేయస్సుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. మతం, ధర్మం మధ్య తేడాను గుర్తించి సనాతన సంప్రదాయాలను ఆచరించడం అవసరమని సూచించారు. కుటుంబ స్థాయి నుంచే మార్పు ప్రారంభమవుతుందని, మహిళలు ఈ మార్పులో కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. దేవాలయాలను బలోపేతం చేయడం, కుల వివక్షను తొలగించి హిందువులు సమైక్యంగా జీవించడం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ జిల్లా విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ మాట్లాడుతూ హిందూ సంఘటన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ స్థాపించబడిందని, కుటుంబ విలువలు, సామాజిక సమరసత, స్వదేశీ భావన, పర్యావరణ పరిరక్షణ, పౌర బాధ్యతలను పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళా వక్త గుత్తుకొండ రామాదేవి మహిళలు సంస్కృతి సంప్రదాయాలను కాపాడటంలో ముందుండాలని, బాలబాలికల్లో దేశభక్తి భావం పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో పూజారులు నిర్వహించిన హోమం, కోలాటాలతో ఊరేగింపులు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవహ గుత్తికొండ రాజశేఖర్, రామడుగు ఖండ కార్యవహ ప్రవీణ్, లింగాచారి, సమితి కార్యకర్తలు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన పేద విద్యార్థులకై కపిల్ విద్యా వారధి అర్హత పరీక్ష

**కరీంనగర్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆర్థిక ఇబ్బందుల కారణంగా పై చదువులకు దూరమవుతున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు సహాయం చేయడానికి కపిల్ విద్యా వారధి సంక్షేమ ట్రస్ట్ ముందుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో స్థిరపడే వరకు అయ్యే ఖర్చులతో పాటు మానసిక ధైర్యం, నైపుణ్యాన్ని అందించడమే ఈ ట్రస్ట్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. మే 20న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు కరీంనగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిరంలో అర్హత పరీక్ష నిర్వహించబడుతుంది. పదో తరగతి సిలబస్‌లోని గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, ఆంగ్లం ఆధారంగా ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. విద్యార్థులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉండాలి. తల్లిదండ్రులు లేని వారు, సింగిల్ పేరెంట్ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. పదో తరగతిలో కనీసం 520 మార్కులు పైగా సాధించి ఉండాలి. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల విద్యార్థులు మాత్రమే అర్హులు. దూర ప్రాంత విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించబడుతుంది. పరీక్ష అనంతరం భోజన వసతి ఉంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాకుండా ఇతర జిల్లాల విద్యార్థులకు ప్రయాణ ఖర్చులు కూడా ఇవ్వబడతాయి. ఆసక్తి గల విద్యార్థులు మే 15లోపు వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి. గత ఏడాది ఎంపికైన విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి: అప్పిడి రాజిరెడ్డి – – 98485 26865 ,గీకురు శ్రీనివాస్ -- 99854 82292

## మే 10న మోదీ సభకు విజయవంతం చెయ్యాలని బీజేపీ నేతల పిలుపు



**కరీంనగర్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ కరీంనగర్ బీజేపీ శ్రేణులు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. ఈస్ట్ జోన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ 7వ డివిజన్‌లో బీజేపీ నాయకుడు వాడే వెంకట రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గోడపత్రికల కార్యక్రమం నిర్వహించారు. సభకు ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని గోడలపై నినాదాలు రాస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, ఈస్ట్ జోన్ నగర అధ్యక్షుడు అవుదుర్తి శ్రీనివాస్‌తో పాటు పలువురు డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మోదీ సభ విజయవంతం కోసం బీజేపీ శ్రేణులు ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నాయి.

## కోతుల సమస్య పరిష్కారం దిశగా చర్యలు



**హుస్నాబాద్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ పట్టణంలో పెరుగుతున్న కోతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ పాలకవర్గం చర్యలు ప్రారంభించింది. సాయిబాబా గుడి వెనుక ప్రాంతంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సహకారంతో పట్టివేత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పురపాలక సంఘం చైర్‌పర్సన్ దండి లక్ష్మి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతులను సురక్షితంగా పట్టుకునేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. పట్టణంలో కోతుల సమస్యను పూర్తిగా నివారించేందుకు మరిన్ని చర్యలు చేపడతామని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు కొండ రజిత, బత్తుల స్వరూప, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలకు స్పందిస్తూ కోతుల బెడద తగ్గించేందుకు మున్సిపల్ పాలకవర్గం ముందడుగు వేసింది.

# కలెక్టరేట్ కార్యనిర్వహణ అధికారి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**కరీంనగర్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగుల కోసం టీఎన్జీవోస్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ చల్లని మజ్జిగను అందజేశారు. దాదాపు 2500 మంది నిరుద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు దాహార్తి, అలసటకు గురవుతున్న నేపథ్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ



కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సహకారంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసే ప్రజల కోసం కూడా టీఎన్జీవోస్ సంఘం ఆధ్వర్యంలో నిరంతరం ఉచిత మజ్జిగ పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీ చరణ్, ఆర్డిఓ మహేశ్వర్, ఏవో సుధాకర్, తహసిల్దార్ నరేందర్, లక్ష్మీ నరసింహారావు, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మిందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు నారాయణ, రాజేశ్వరరావు, చిరంజీవి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకరయ్య, పెన్షన్ల సంఘం అధ్యక్షుడు కేశవతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు. ఎండ తీవ్రతలో ప్రజలకు ఉపశమనం కలిగించే మజ్జిగ పంపిణీ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది.

# ఓపెన్ జిమ్‌లు ,సీసీ రోడ్ల పనులకు శ్రీకారం




**కరీంనగర్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిట్ ఇండియా నినాదాన్ని పురస్కరించుకుని కరీంనగర్ ప్రజలకు ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపు కోటి రూపాయల వ్యయంతో 17 డివిజన్లలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. నాల్కో సంస్థ అందిస్తున్న సీఎస్సార్ నిధుల సహకారంతో మలయప్ప ఫౌండేషన్ ఈ జిమ్‌లను నిర్మిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని కిసాన్ నగర్ అంబేద్కర్ యూత్ క్లబ్ సమీపంలో, దుర్షేడ్‌లో ఏర్పాటు చేసిన రెండు ఓపెన్ జిమ్‌లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె. సంగప్ప, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. మలయప్ప ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ గడ్డం అరుంజయ్, గడ్డం అనూష మాట్లాడుతూ ఉద్యోగాల్లో బిజీగా ఉండి శారీరక ఫిట్‌నెస్ కోల్పోతున్న వారికి ఈ ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కరీంనగర్ ప్రజలంతా ఈ జిమ్‌లను వినియోగించుకుని శారీరక ధృఢత్వాన్ని పెంచుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. అంతకుముందు బండి సంజయ్ కుమార్ కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గత ఆరేళ్లలో తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వందల కోట్ల రూపాయలను ఖర్చు చేశామని, ఈసారి కూడా నిధులు మంజూరై సీసీ రోడ్లతో పాటు ఇతర అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నామని తెలిపారు. ఫిట్ ఇండియా లక్ష్యంతో జిమ్‌లు, గ్రామీణ అభివృద్ధి కోసం సీసీ రోడ్లు -- రెండు రంగాల్లోనూ కరీంనగర్ ప్రజలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి.

## రైతును రాజు చేసేది
# ఆయిల్ ఫామ్ - తిరుపతి రెడ్డి




**హుస్నాబాద్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా ఆయిల్ పామ్ సాగు చేస్తే ఆర్థికంగా బలపడటమే కాకుండా దీర్ఘకాలిక లాభాలు పొందవచ్చని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి అన్నారు. మంగళవారం శుభం గార్డెన్‌లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న వంటి సాంప్రదాయ పంటలకంటే ఆయిల్ పామ్ రైతులకు మరింత ప్రయోజనకరమని, ఒక్కసారి సాగు చేస్తే 30 సంవత్సరాల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతు రాజు కావాలంటే ఆయిల్ పామ్ సాగు ఉత్తమ మార్గమని సూచించారు. ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ఐలయ్య మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం దెబ్బతింటోందని, రైతులు సేంద్రియ ఎరువులతో ఆయిల్ పామ్ వంటి పంటలు సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ రైతు కష్టపడితేనే దేశ ప్రజలకు అన్నం అందుతుందని, రైతు లేని రాజ్యం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వినియోగించుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సింగిల్ విండో చైర్మన్ శివయ్య మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, ఒకసారి సాగు చేస్తే దశాబ్దాల పాటు లాభాలు పొందవచ్చని చెప్పారు. రైతులు తమ భూమిలో కొంత భాగాన్ని ఆయిల్ పామ్‌కు కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కోహెడ మార్కెట్ చైర్మన్ నిర్మల, కౌన్సిలర్లు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు. రైతు రాజు కావాలంటే ఆయిల్ పామ్ సాగు ఉత్తమ మార్గమని నిపుణులు సూచించారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర
# మహాసభలకు ఏర్పాట్లు



**కరీంనగర్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ నాలుగో మహాసభలు సెప్టెంబర్‌లో కరీంనగర్‌లో జరగనున్నాయి. ఈ మహాసభలను విజయవంతం చేయడానికి కార్మిక లోకం కదం తొక్కాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మిక, కర్షక, కమ్యూనిస్టు ఉద్యమాలకు ఖిల్లాగా పేరుగాంచిన కరీంనగర్ జిల్లాలో మహాసభలు జరగడం గర్వకారణమని అన్నారు. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిపిఐ మహాసభలు ఘనంగా నిర్వహించిన ఈ జిల్లాలో మరోసారి రాష్ట్ర మహాసభలకు ఆతిథ్యం ఇవ్వడం విశేషమని పేర్కొన్నారు. మహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘం, ఇతర కమిటీలను ఏర్పాటు చేసి ముందుకు సాగాలని, పార్టీ తరపున అన్ని విధాల సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు వి.ఎస్. బోస్, కరీంనగర్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, రామడుగు లక్ష్మణ్, తాండ్ర సదానందం, చెన్న విశ్వనాథం, మంద సుదర్శన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శులు యూసఫ్, బాల్ రాజ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నరసింహ, రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, జి. వెంకటేష్, కరుణ, ప్రవీణ్ కుమార్, ఉమ్మడి జిల్లా ఏఐటీయూసీ నాయకులు కదారి సునీల్, రాములు, వేణు, పిట్టల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. తాజా రాజకీయాలపై విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు స్పష్టంగా పనిచేసిందని అన్నారు. వామపక్షాలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డా కమ్యూనిస్టు సిద్ధాంతం అజేయమని, ఆటుపోట్లు సహజమని, వాటిని ఎదుర్కొని మళ్లీ పుంజుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో పెట్టుబడిదారుల ఆస్తులు పెరుగుతుండగా పేదవాడు మరింత పేదవాడవుతున్నాడని అన్నారు. ఈ నేపథ్యంలో వామపక్ష శక్తులు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు ఒక వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక ఉద్యమాలకు కరీంనగర్ మరోసారి వేదికగా నిలుస్తుండగా, రైతు సమస్యలపై కూడా చాడ వెంకటరెడ్డి గళమెత్తారు.

# నేతన్న భీమా చెక్కుల పంపిణీ

### -ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**నకిరేకల్ మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈరోజు నగరికల్ మున్సిపాలిటీ పరిధిలోని చేనేత జోలి శాఖ నల్గొండ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన జరిగినటువంటి నేతన్న భీమా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు అట్టహాసంగా జరిగినది ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్ నోముల ఏపూర్ మాంద్ర నేరుడా మద్రు పల్లె పహాడ్ నెమ్మది కు చెందిన 12 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున మొత్తం 60 లక్షల రూపాయలు మా చెక్కులను ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగినది

## మార్కెట్ యార్డులో విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న రైతులు




**హుస్నాబాద్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మార్కెట్ యార్డులో నాసిరకం విద్యుత్ సదుపాయాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్కువ సామర్థ్యమున్న బ్రేకర్లు, నాసిరకం వైరింగ్ వల్ల ధాన్యం పట్టే యంత్రాలు గత నాలుగు రోజులుగా సక్రమంగా పనిచేయక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలు ఒక్క నిమిషం కూడా నడవక ముందే బ్రేకర్లు పడిపోవడంతో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు నిలిచిపోతున్నాయి. ఆధునిక భవనం నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ తక్కువ గేజ్ వైర్లు, తక్కువ ఆంప్స్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం వల్లే ఈ సమస్య తలెత్తిందని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో 20--30 యంత్రాలు ఉన్నప్పటికీ సరైన విద్యుత్ సరఫరా లేక వినియోగానికి నోచుకోవడం లేదని తెలిపారు. ఒకే ఫేస్ ద్వారా మొత్తం మార్కెట్‌కు విద్యుత్ సరఫరా చేయడం వల్ల తరచూ బ్రేకర్లు ట్రిప్ అవుతున్నాయని, రైతులే స్వయంగా బ్రేకర్లు ఆన్ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిదని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ ప్రశ్నించారు. మార్కెట్ పాలకవర్గం వెంటనే స్పందించి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు సూచించిన మేరకు అల్యూమినియం వైర్లకు బదులుగా కాపర్ వైర్లు ఏర్పాటు చేయడం, మెయిన్ పవర్ సప్లైను పలుభాగాలుగా విభజించి ప్రత్యేక బ్రేకర్లు అమర్చడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా మార్కెట్ యార్డులో విద్యుత్ సదుపాయాల మెరుగుదల తక్షణం చేపట్టాలని బీఎస్పీ నాయకులు కోరుతున్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్ష సమావేశం



**గంగాధర,మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలతో తహసిల్దార్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ అంబటి రజిత మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రైతులకు తాగునీరు, నీడ, టార్పాలిన్ వంటి కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు మద్దతు ధర వివరాలు తెలిపే బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లు ఎప్పటికప్పుడు జరగాలని, రైతుల వరుస క్రమంలో తూకం నిర్వహించాలని, రైతులను ఇబ్బందులకు గురిచేయరాదని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా తరలించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగరాదని, ప్రతి వివరాన్ని ఆన్లైన్‌లో నమోదు చేయాలని తహసిల్దార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ కళావతి, ఐకేపీ ఏపీఎం కుమార్, ఆర్ఐలు సంతోష్ కుమార్, రజనీకాంత్ రెడ్డి, పిఎసిఎస్ సీఈఓలు, ఐకేపీ, పిఎసిఎస్ సెంటర్ ఇంచార్జీలు పాల్గొన్నారు. రైతుల సౌకర్యం, పారదర్శకతతో కొనుగోళ్లు జరగాలని అధికారులు స్పష్టం చేశారు.

## వరి కొనుగోలు ప్రక్రియపై
# కలెక్టర్ పరిశీలన



**హుస్నాబాద్, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: రైతులు వరి ధాన్యాన్ని తేమ శాతం వచ్చేవరకు వ్యవసాయ క్షేత్రాల వద్దనే ఆరబెట్టుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం ఆరబెట్టడం వలన అకాల వర్షాలు వస్తే పెద్ద ఎత్తున నష్టాలు వాటిల్లే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మక్కలు, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు తమకు దగ్గరలోని గ్రామాల వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. మక్కలను మాత్రం వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు చేస్తామని తెలిపారు. ఏఎంసి పరిధిలో పల్లపు ప్రాంతాల్లో ధాన్యం ఆరబెట్టకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, అధికారులు రైతులు ఆ నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తేమ శాతం వచ్చి లిఫ్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం కోసం వెంటనే సరిపడినన్ని లారీలను పంపాలని సివిల్ సప్లై అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీవో రామ్మూర్తి, ఏఎంసి చైర్మన్ తిరుపతి రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# బిజినెస్

# గంటల్లోనే కుప్పకూలిన బంగారం ధరలు..

**-ఒక్కసారిగా భారీగా పతనం.. లేటెస్ట్ రేట్లు ఇవే..**

బంగారం ధరలు పడిపోతున్నాయి. ఉదయం ఒకరేటు ఉండగా.. మారట?ట్లు ప్రారంభం కాగానే ధరలు మారిపోతున్నాయి. ఇటీవల గత కొద్దిరోజులుగా బంగారం ధరలు కుప్పకూలుతూ వస్తోన్నాయి. ఈ వారం కూడా అదే బాటలో నడుస్తున్నాయి. సోమవారం బంగారం ధరలు పతనమవ్వగా.. మంగళవారం మరింత తగ్గుముఖం పట్టాయి. చాలా రోజుల తర్వాత రూ.1.50 లక్షల మార్క్ దిగువకు గోల్డ్ రేట్లు చేరుకున్నాయి.తగ్గిన తర్వాత ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాములు 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,180 వద్ద కొనసాగుతోండగా.. నిన్న రూ.1,49,620 వద్ద స్థిరపడ్డాయి. ఈ రోజు రూ.440 తగ్గిందని చెప్పవచ్చు. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,36,750గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,37,150గా ఉండగా.. నిన్నటితో చూస్తే





రూ.400 తగ్గింది.విజయవాడ, విశాఖపట్నంలో కూడా పై ధరలే కొనసాగుతున్నాయి. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,50,770గా ఉండగా.. నిన్న రూ.1,52,730గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.1960 తగ్గింది. 22 క్యారెట్ల రేటు రూ.1,38,200 వద్ద కొనసాగుతోంది. నిన్న ఇది రూ.1.40 లక్షల వద్ద ఉండగా.. ఇవాళ రూ.1800 తగ్గిందని చెప్పవచ్చు.బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,49,180 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,36,750గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,230గా ఉంది. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1,36,900 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీలో కేజీ సిల్వర్ రూ.2.55 లక్షలుగా ఉంది. నిన్న రూ.2.65 లక్షలుగా ఉండగా.. ఇవాళ ఏకంగా రూ.10 వేలు తగ్గింది. ఇక హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉండగా.. నిన్న రూ.2.70 లక్షలుగా ఉంది. ఇక చెన్నైలో రూ.2.65 లక్షల వద్ద కొనసాగుతోంది.

# పెరిగిన యూపీఐ లావాదేవీలు




**న్యూఢిల్లీ,**

యూపీఐ లావాదేవీలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే 2200 కోట్ల లావాదేవీలు జరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో జరిగిన 1,789 కోట్ల లావాదేవీలతో పోలిస్తే 25 శాతం పెరిగాయని పేర్కొంది. కానీ, మార్చి నెలలో రికార్డు స్థాయి 2,264 కోట్ల లావాదేవీలతో పోలిస్తే తగ్గాయి. ఇప్పటి వరకు ఇదే చారిత్రక గరిష్ఠ స్థాయని తన ఎక్స్‌లో వెల్లడించింది.యూపీఐ లావాదేవీలపై రిజర్వుబ్యాంక్ పలు భద్రత ఫీచర్లను పాటిస్తుంది. మొదటిది యూజర్లకు సంబంధించిన అన్ని బ్యాంక్ ఖాతాలను మొబైల్ నంబర్‌తో లింక్డ్ చేయడం, యూపీఐ పిన్, లావాదేవీలను వెనువెంటనే పూర్తయ్యే విధంగా టెక్నాలజీని ఆధునీకరించడం కూడా లావాదేవీలు పెరుగడానికి కారణమని పేర్కొంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో 85 శాతం యూపీఐ ద్వారా జరుగుతున్నాయి.

# రుణాలు మాఫీ చేయిస్తామంటే నమ్మొద్దు..

**-ప్రజల్ని అప్రమత్తం చేసిన ఆర్‌బీఐ**

**ముంబై, మే 4**

రుణాలను మాఫీ చేయిస్తామంటూ జరిగే తప్పుడు ప్రచారాలతో జాగ్రత్తని, ఇలాంటి మోసపూరిత హామీలను ఇచ్చే వ్యక్తులు, సంస్థలకు దూరంగా ఉండాలని ప్రజలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అప్రమత్తం చేసింది. నేరుగా లేదా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అమాయకులను అక్రమార్కులు మోసం చేస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సెంట్రల్ బ్యాంక్ ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది.2023 డిసెంబర్‌లోనూ ఇదే తరహా సూచనను చేశామని గుర్తుచేసిన ఆర్బీఐ.. ఈ మోసాల వల్ల సాధారణ ప్రజానీకమేగాక, సక్రమంగా నడుస్తున్న దేశీయ రుణ వ్యవస్థ సైతం గాడితప్పే ప్రమాదం ఉందన్నది. ఆర్థిక సంస్థల్ని అస్థిరపర్చడమేగాక, డిపాజిటర్ల ప్రయోజనాలూ దెబ్బతింటాయన్నది. కాబట్టి బ్యాంకులు/బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోని బకాయిలను రద్దు చేయిస్తామన్న మాటల్ని నమ్మి, ఎవరికి ఏవిధంగానూ సొమ్మును చెల్లించరాదని ప్రజలను కోరింది. అలాగే మాయమాటలతో ఇలాంటి మోసాలకు తెగబడితే చట్టప్రకారం కఠిన శిక్షలకు అర్హులవుతారని కేటుగాళ్లను రిజర్వ్ బ్యాంక్ ఈ సందర్భంగా హెచ్చరించింది.

# స్పోర్ట్స్

# చెన్నై పాంచ్ పటాకా..

**-ఢిల్లీపై అలవోక విజయం**
**-శాంసన్ సూపర్ ఇన్నింగ్స్**




ఢిల్లీ

ఐపీఎల్-19లో పడుతూ లేస్తూ సాగుతున్న చెన్నై సూపర్ కింగ్స్.. వరుసగా రెండో విజయం సాధించి ప్లేఆఫ్స్ రేసును రసవత్తరంగా మార్చేసింది. మంగళవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే.. ఢిల్లీ క్యాపిటల్స్‌ను వారి సొంతగడ్డపై 8 వికెట్ల తేడాతో చిత్తుచేసి సీజన్‌లో ఐదో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఢిల్లీ నిర్దేశించిన 156 పరుగుల ఛేదనను 17.3 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి పూర్తిచేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఓపెనర్ సంజూ శాంసన్ (52 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 87 నాటౌట్) మరో కీలక ఇన్నింగ్స్ ఆడగా కార్తీక్ శర్మ (31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41 నాటౌట్) అతడికి అండగా నిలిచాడు.

తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ.. మరోసారి పేలవ బ్యాటింగ్‌తో నిర్ణీత ఓవర్లలో 155/7కే పరిమితమైంది. సమీర్ రిజ్వీ (24 బంతుల్లో 4 సిక్సర్లతో 40 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (31 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 38) ఆదుకోకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ (2/22) రెండు వికెట్లు తీయగా అకీల్ (1/19), ముకేశ్ (1/31) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఈ గెలుపుతో ప్లేఆఫ్స్ రేసులో సీఎస్‌కే ముందంజ వేయగా మరోవైపు ఆరో ఓటమితో క్యాపిటల్స్ తమ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది.

**నిలిచి గెలిపించిన శాంసన్**

బంతి ఆధిపత్యం చెలాయించిన పిచ్‌పై ఛేదన అంత తేలికేమీ కాదని తెలియడానికి చెన్నైకి పెద్దగా టైమ్ పట్టలేదు. పవర్ ప్లేలో ఆ జట్టు రుతురాజ్ (6) వికెట్‌ను కోల్పోవడమే గాక చేసింది 44 పరుగులే. స్టార్క్, ఎంగిడి పొదుపుగా బౌలింగ్ చేయడంతో పర్యాటక జట్టు పవర్ ప్లేలో సైతం సింగిల్స్ మీదే దృష్టిపెట్టింది. ఎంగిడి బౌలింగ్‌లో స్కేర్ లెగ్, లాంగాన్ మీదుగా భారీ సిక్స్‌లు కొట్టిన ఉర్విల్ (17).. అక్షర్ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. 50 రన్స్ చేరడానికి ఆ జట్టు 7.2 ఓవర్లు ఆడాల్సి వచ్చింది. కానీ క్రీజులో కుదురుకునేదాకా నెమ్మదిగా ఆడిన సంజూ.. మరో కీలక ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. నటరాజన్ వేసిన 9వ ఓవర్లో రెండు ఫోర్లతో గేర్ మార్చిన అతడు, ఆ తర్వాత ఎక్కడా తగ్గలేదు. కుల్‌దీప్ 12వ ఓవర్లో అయితే 6, 6, 4తో విరుచుకుపడ్డాడు. 32 బంతుల్లో అర్ధ శతకం సాధించిన సంజూ.. స్టార్క్ మరుసటి ఓవర్లోనూ రెండు బౌండరీలు బాది స్కోరుబోర్డును వంద దాటించాడు. నట్టూ వేసిన 15వ ఓవర్లోనూ రెండు సిక్స్‌లు, ఫోర్‌తో 20 రన్స్‌ను రాబట్టి తన జట్టును గెలుపు దిశగా నడిపించాడు. నట్టూ బౌలింగ్‌లోనే సిక్స్, ఫోర్‌తో కార్తీక్ లాంఛనం పూర్తిచేశాడు.

**ఐపీఎల్ పాయింట్ల పట్టిక**

| జట్లు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| పంజాబ్ | 9 | 6 | 2 | 1 | 13 | 0.85 |
| బెంగళూరు | 9 | 6 | 3 | 0 | 12 | 1.42 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 0 | 12 | 0.64 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 0 | 12 | 0.51 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 0 | 12 | -0.14 |
| చెన్నై | 10 | 5 | 5 | 0 | 10 | 0.15 |
| ఢిల్లీ | 10 | 4 | 6 | 0 | 8 | -0.94 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 1 | 7 | -0.53 |
| ముంబై | 10 | 3 | 7 | 0 | 6 | -0.64 |
| లక్నో | 9 | 2 | 7 | 0 | 4 | -1.07 |

నోట్: ఆ:ఆడినవి, గె:గెలిచినవి, ఓ: ఓడినవి, పా:పాయింట్లు, ర.రే: రన్‌రేట్, ఫ.తే:ఫలితం తేలనివి

**మళ్లీ తడపడి..**

ఒక మ్యాచ్‌లో ధాటిగా ఆడితే మరోదాంట్లో తేలిపోతున్న ఢిల్లీ.. ఈ పోరులో అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. బ్యాటర్లకు కఠిన సవాల్ విసిరిన పిచ్‌పై చెన్నై స్పిన్నర్లు చెలరేగడంతో క్యాపిటల్స్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఆ జట్టులో రిజ్వీ, స్టబ్స్ మినహా మిగిలినవారెవరూ 20 పరుగుల మార్కునూ దాటలేక చతికిలపడ్డారు. అకీల్‌కు తొలి ఓవర్లోనే రెండు బౌండరీలతో స్వాగతం పలికిన నిశాంక (19).. ముకేశ్ ఓవర్లో మిడాన్‌లో బ్రెవిస్ చేతికి చిక్కడంతో ఆ జట్టు వికెట్ల పతనం మొదలైంది. కేఎల్ రాహుల్ (12)ను అకీల్ బోల్తా కొట్టించాడు. ఇదే జోష్‌లో నూర్ తన వరుస ఓవర్లలో కరుణ్ నాయర్ (13), నితీశ్ రాణా (15)ను పెవిలియన్‌కు పంపడంతో మ్యాచ్‌పై సీఎస్‌కే మరింత పట్టుబిగించినైట్టెంది.

గుర్జప్‌నీత్ విసిరిన 11వ ఓవర్ ఆఖరి బంతిని ఆడబోయిన ఢిల్లీ సారథి అక్షర్ (2).. కవర్స్‌లో అకీల్ చేతికి చిక్కడంతో ఢిల్లీ 69/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రిజ్వీ, స్టబ్స్ వికెట్ కాపాడుకునేందుకే ఆడటంతో ఢిల్లీ స్కోరుబోర్డు ముందుకు కదల్లేదు. 15.2 ఓవర్లకు ఆ జట్టు స్కోరు వంద పరుగుల మార్కును అందుకోగా చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసి క్యాపిటల్స్‌ను భారీ స్కోరు చేయకుండా అడ్డుపడ్డారు. ఈ జోడీ 8 ఓవర్లపాటు క్రీజులో నిలిచినా చేసింది 65 పరుగులే. స్టబ్స్ భారీ స్కోరు చేయలేక విఫలమైనా అన్షుల్ 18వ ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టిన రిజ్వీ ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చే యత్నం చేశాడు. ఆఖర్లో అశుతోష్ శర్మ (14) రెండు సిక్సర్లతో క్యాపిటల్స్ స్కోరును 150 పరుగుల మార్కును దాటించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**ఢిల్లీ:** 20 ఓవర్లకు 155/7 (రిజ్వీ 40నాటౌట్, స్టబ్స్ 38, నూర్ 2/22, ఒవర్టన్ 1/5);

**చెన్నై:** 17.3 ఓవర్లకు 159/2 (సంజూ 87నాటౌట్, కార్తీక్ 41నాటౌట్, అక్షర్ 1/25, ఎంగిడి 1/30)

# అగ్రస్థానంలోనే భారత్







**దుబాయ్:**

టీ20క్రికెట్‌లో తమకు తిరుగులేదని భారత్ మరోసారి నిరూపించింది. వరుసగా రెండోసారి పొట్టి ప్రపంచకప్ (మొత్తంగా మూడోసారి) గెలిచి చరిత్ర సృష్టించిన టీమ్‌ఇండియా.. ఐసీసీ వార్షిక టీ20 ర్యాంకింగ్స్‌లో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 2025 మే నుంచి జరిగిన మ్యాచ్‌ల వెయిటేజీని పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ ఈ ర్యాంకులను విడుదల చేసింది.275 రేటింగ్ పాయింట్లతో మెన్ ఇన్ బ్లూ తొలి స్థానంలో ఉండగా ఇంగ్లండ్ (262), ఆస్ట్రేలియా (258), న్యూజిలాండ్ (247), సౌతాఫ్రికా (244) టాప్-5లో నిలిచాయి.